అదానీ తొండి.. ఉపాధికి గండి

కులవృత్తుల మెడపై అదానీ కత్తి • సిరిపురం చేనేతకు ఇక వలపోత • ఉరితాళ్లుగా గొడన్నల మోకులు • మూలకు మత్స్యకారుల వలలు • గొల్లకురుమల గోడు పట్టేదెవరికి?

కంపెనీ పెట్టాక ఇచ్చేది 90 కొలువులే • అధఃపాతాళానికి భూముల రేట్లు! • స్థానికులకు తీరని వేదన • ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటామని ప్రతిన

(పున్న శ్రీకాంత్)

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): వారిది రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి. ఏ పూటకు ఆ పూట పని చేసుకుంటూ కుటుంబాలను వెళ్లదీస్తున్న పేదలు వారు. కుల వృత్తులనే నమ్ముకొని జీవితాలను నెట్టుకొస్తున్న నిస్సహాయులు. ఉన్నంతలో సాఫీగా సాగుతున్న వారి కుటుంబాల్లో అదానీ కంపెనీ మంటలు రేపుతున్నది. చేతినిండా దొరికే ఉపాధికి గండి కొట్టే ప్రమాదం నెలకొంది. రామన్నపేటలో అంబుజా సిమెంట్ పరిశ్రమ స్థాపనతో చుట్టుపక్కల ఉన్న పద్మశాలి, గౌడ్, ముదిరాజ్, గొల్లకురుమలు వృత్తితోపాటు ఉపాధికి దూరం కానున్నారు. మరోవైపు వర్తక, వ్యాపారాలు దివాలా తీయనున్నాయి. ఇంత కోల్పోయినా కంపెనీ ఏర్పడితే ఆ సంస్థ తొలి విడతలో ఇచ్చేది కేవలం 90 కొలువులు మాత్రమే. అంతిమంగా ఉన్న ఊరు.. కట్టుకున్న ఇల్లు వదిలి పెట్టి స్థానికులకు వలసలే దిక్కు కానున్నాయి.

డ్రైపోర్టు ముసుగులో భూముల కొనుగోళ్లు

యాదాద్రి భువనగిరి జిల్లాలోని రామన్నపేటలో అదానీ అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గతంలో లాజిస్టిక్ పార్కు, డ్రైపోర్టు కోసం రైతుల నుంచి కొనుగోలు చేసిన భూముల్లో కాలుష్య కారక సిమెంట్ కంపెనీ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. 65.5 ఎకరాల్లో కంపెనీ స్థాపనకు రూ.1,400 కోట్లు ఖర్చు చేయనున్నారు. స్టాండ్ అలోన్ సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌లో ఏటా 6.0 ఎంఎంటీపీఏ సిమెంట్ ఉత్పత్తికి ప్రతిపాదనలు చేశారు. ఈ నెల 23న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నారు. సిమెంట్ పరిశ్రమను వ్యతిరేకిస్తున్న ప్రజలు ప్రభుత్వం, అదానీని తప్పుబడుతూ పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. పరిశ్రమ స్థాపన నిర్ణయాన్ని ఉపసహించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కళ తప్పనున్న సిరిపురం చేనేత!

అదానీ సంస్థ ప్రతిపాదించిన సిమెంట్ పరిశ్రమ జనావాసాలకు వందల మీటర్ల దూరంలోనే ఉంది. రామన్నపేటకు 500 మీటర్లు, కొమ్మాయిగూడెం 500, సిరిపురం గ్రామం కిలోమీటరు పరిధిలో ఉంది. రామన్నపేట రైల్వే స్టేషన్ పక్కనే దీన్ని ప్రతిపాదించారు. ఇవే కాకుండా మరో 10 గ్రామాలు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. పరిశ్రమ ప్రభావం సుమారు 10 కిలోమీటర్ల వరకు ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. సిరిపురం కిలోమీటరు దూరంలోనే ఉంది. చేనేత వస్త్రాలకు పేరుగాంచిన సిరిపురం ఇక కళావిహీనంగా మారే అవకాశం ఉంది. శబ్ద, వాయు, జల కాలుష్యంతో నేతన్నలు చేనేత ప్రభను కోల్పోనున్నారు. కంపెనీ కాలుష్యం వల్ల రాత్రి సమయంలో ప్రజలు ఆరుబయట, ఇంటి పైన పడుకుంటే పొగ, దుమ్ము, ధూళి మీద పడి తెల్లవారేసరికి మనిషి బొమ్మ మాదిరి అచ్చుదింపినట్టు అయిపోతాడని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నూలుకు రంగులు అద్దడం, అలుగు చాపడం, ఆరబెట్టడం తదితర పనులన్నీ ఆరుబయటే చేస్తారు. సిమెంట్ దుమ్ము గాలిలో నుంచి వచ్చి వాటిపై పడితే వస్త్రం నాణ్యత లోపిస్తుందని, రంగు మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. సిరిపురంతోపాటు రామన్నపేట, బోగారం, ఇంద్రపాల నగరం, వెల్లంకి, జనంపల్లిలో చేనేత కార్మికులు వృత్తిని నమ్ముకొని జీవిస్తున్నారు.

మత్స్యకారుల మనుగడ సాగేదెలా?

సిమెంట్ పరిశ్రమకు రోజూ సుమారు 6 లక్షల లీటర్ల నీరు అవసరం అవుతుందని సదరు కంపెనీ నివేదికలో పేర్కొన్నది. ధర్మారెడ్డిపల్లి కాల్వ సామర్థ్యమే 3 లక్షల లీటర్లు. మిగతా 3 లక్షల లీటర్ల నీటిని వర్షాలతోపాటు కృత్రిమ వనరుల ద్వారా సృష్టిస్తామని రిపోర్టులో పేర్కొన్నారు. అంతేగాక, 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న 12 చెరువుల్లో నీటి వనరులు ఉన్నాయని పొందుపరిచారు. ఇందులో కొమ్మాయిగూడెం చెరువు, రామన్నపేట, పెద్దకాపర్తి, వెల్లంకి, వెలిమినేడు, నీర్నెముల, నందనపల్లి, జనంపల్లి, శివనేనిగూడెం, ఇస్కిళ్ల, మునిపంపుల, ఇంద్రపాలనగరం చెరువులను చూపించారు. ఒకవేళ వర్షాలు పడకుంటే పరిస్థితి ఏంటని, నీటిని ఎక్కడి నుంచి సరఫరా చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నివేదికలో పేర్కొన్న చెరువుల నుంచే నీటిని తరలించాలనే కుట్ర చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ధర్మారెడ్డిపల్లి కాల్వ మురికి కూపంగా మారే ప్రమాదం ఉండగా, కంపెనీ దగ్గర నుంచి ఇది 16 గ్రామాల మీదుగా ప్రవహిస్తుంది. ఆయా గ్రామాల చెరువులు జలవ్యర్థాలతో మురికి కూపంగా మారనున్నాయి. నీరు తగ్గడంతో పాటు, విషతుల్యంగా మారడంతో మత్స్య సంపద పెరుగుదల ఆగిపోతుంది. దీంతో చెరువులపై ఆధారపడి బతుకుతున్న మత్స్యకారులు తమ ఉపాధిని కోల్పోతారు. ఫలితంగా వందలాది కుటుంబాలు రోడ్డున పడతాయి.

ఉరితాళ్లుగా మారనున్న గొడన్నల మోకులు..

సిమెంట్ పరిశ్రమ ఏర్పడితే గొడన్నలు ఉపాధి కోల్పోయే అవకాశం ఉంది. కంపెనీతో భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. తాటిచెట్లు, ఈత చెట్ల ఎదుగుదల ఆగిపోతుంది. ప్రస్తుతం ఉన్న చెట్లు సైతం దుమ్ము, ధూళితో రంగు మారే అవకాశం ఉంది. కల్లు రంగుతోపాటు రుచి కూడా మారుతుంది. ఫలితంగా ఈ కల్లును ఎవరూ తాగేందుకు ముందుకు రారు. ఇప్పటికే మూసీ పరీవాహక ప్రాంతాల్లో తాటి, ఈత చెట్ల కల్లును కొనే పరిస్థితి లేదు. చుట్టుపక్కల అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున గొడన్నలు కల్లు గీస్తారు. ప్రధానంగా కొమ్మాయిగూడెంలో అందరూ గౌడ్ సామాజిక వర్గం వారే ఉన్నారు. ఇక సిమెంట్ పరిశ్రమ ఏర్పడితే గొడన్నలు సంపాదించే అరకొర డబ్బులు కూడా కోల్పోయి ఉపాధికి గండి పడనుంది.

గొల్ల కురుమల జీవాలు బతికేదెలా?

కంపెనీ ఏర్పాటు చేయబోయే ప్రదేశం ముఖ్యంగా హైదరాబాద్‌కు సమీపంలో ఉండడంతో యాదాద్రి భువనగిరి జిల్లాలో రియల్ ఎస్టేట్ ఊపందుకుంది. వ్యవసాయ భూములకు మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం రామన్నపేట పరిధిలో ఏరియాను బట్టి ఎకరాకు రూ.60 లక్షల నుంచి రూ. 80 లక్షల దాకా పలుకుతున్నది. పరిశ్రమ స్థాపిస్తే కొన్ని రోజుల తర్వాత భూమి బూడిద రంగు, పసుపు, ముదురు గోధుమ రంగులోకి మారే ప్రమాదం ఉంది. ప్రతి రోజూ విడుదలయ్యే వ్యర్థాలు భూగర్భ జలాల్లోకి నింపడంతో సారవంతమైన భూములు పూర్తిగా దెబ్బతింటాయి. వ్యవసాయం అంతంత మాత్రంగానే సాగు కానుంది. ఫలితంగా భూములు కొనడానికి కూడా ఎవరూ ముందుకు రారు. అంతిమంగా అతి తక్కువ ధరకు సిమెంట్ ఫ్యాక్టరీ వాళ్లే కొనాల్సిన పరిస్థితి వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రామన్నపేట శివారులో అదానీకి చెందిన సిమెంట్ పరిశ్రమను ఏర్పాటుచేయనున్న స్థలం

చేనేత వృత్తి పోయి ఉపాధి కోల్పోతాం

సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే చేనేత వృత్తి దెబ్బతింటుంది. ఈ వృత్తిలో ఆరబెట్టడం, రంగులు అద్దడం వంటి ప్రక్రియను ఆరుబయటే చేయవలసి వస్తుంది. సిమెంట్ కంపెనీ వల్ల వచ్చే దుమ్ము, దూళితో వస్త్రాల నాణ్యత దెబ్బతింటుంది. తద్వారా మార్కెట్‌లో వస్త్రాల డిమాండ్ తగ్గిపోతుంది. ఫలితంగా చేనేత పరిశ్రమ మనుగడ ప్రమాదంలో పడుతుంది.

- పున్న వెంకటేశం, చేనేత కార్మికుడు, వెల్లంకి, రామన్నపేట మండలం

సిమెంట్ పరిశ్రమతో గీత వృత్తికి ముప్పు

మండలంలో వేల కుటుంబాలు గీత వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల వచ్చే రసాయనాలు, దుమ్ము, దూళి వల్ల కల్లు కలుషితమై వృత్తికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. దాంతో గీత కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేయాలనే ఆలోచనను విరమించుకోవాలి.

- కూనూరు వెంకటేశం, గీత కార్మికుడు, సిరిపురం, రామన్నపేట మండలం

అదానీ ఇచ్చేది 90 ఉద్యోగాలే

అదానీ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటైతే వేలాదిమంది ఉపాధి కూలీలపై దెబ్బ పడుతున్నది. ఆ సంస్థ ఇచ్చేది 90 ఉద్యోగాలే. కంపెనీని రెండు విడతలుగా ఏర్పాటు చేయనుండగా మొత్తంగా 180 ఉద్యోగాలు ఇస్తామని సంస్థ ప్రకటించింది. అందులోనూ తొలి విడతలో 90 మందికే ఇస్తామని స్పష్టంచేసింది. వాటిలో 15 రెగ్యులర్, 75 కాంట్రాక్టు పోస్టులు ఉంటాయని తేల్చింది. అర్హతను బట్టి ప్రాధాన్యం ఇస్తామని కొర్రీలు పెట్టింది. అవి కూడా ఏ పోస్టులు అనేది స్పష్టం చేయలేదు. అటెండర్, అసిస్టెంట్ స్థాయి పోస్టులు తప్ప తమకేం ఇస్తారని స్థానికులు మండిపడుతున్నారు.

ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటాం

మండలంలో ఎట్టి పరిస్థితిలోనూ అంబుజా సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేయనివ్వం. పరిశ్రమ ఏర్పాటు చేస్తే 10 కిలోమీటర్ల మేర వ్యవసాయం, కుల వృత్తులపై ఆధారపడి జీవించే చేనేత, గీత కార్మికులు, మత్స్యకార్మికులు ఉపాధి కోల్పోయే అవకాశం ఉంది. పరిశ్రమ ఏర్పాటు వల్ల ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదముంది. సిమెంట్ పరిశ్రమను అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. 23న నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటాం.

- కంభంపాటి శ్రీనివాస్, పల్లివాడ, రామన్నపేట మండలం

బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

అదానీ కంపెనీ ఆగడాలను అడ్డుకుంటాం

- అంబుజా సిమెంట్‌కు అనుమతులను రద్దు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- భువనగిరి కలెక్టరేట్ ఎదుట ధర్నా

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 22 : రామన్నపేటలో అదానీ గ్రూప్ ఏర్పాటు చేయతల పెట్టిన కాలుష్య కారక అంబుజా సిమెంట్ పరిశ్రమను ఎన్ని అడ్డంకులు వచ్చినా అడ్డుకుంటామని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హెచ్చరించారు. అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు సంబంధించిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ పచ్చటి పంట భూముల మధ్య అంబుజా సిమెంట్ కర్మాగారం నెలకొల్పి పల్లెలను కాలుష్య కోరల్లోకి నెట్టే కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం లోపాయికారి ఒప్పందాలతో ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు సహకరిస్తున్నదని ఆరోపించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే పరిశ్రమలను నెలకొల్పుతామంటే సహించేది లేదని హెచ్చరించారు.

కాలుష్య కాసారంగా కృష్ణపట్టి

- గ్రామాలపై ప్రవాహంలా బూడిద, లైమ్ పౌడర్
- 9 ఫ్యాక్టరీలతో 25 గ్రామాలు సతమతం
- సూర్యాపేట జిల్లాలో సిమెంట్ పరిశ్రమల పరిస్థితి

సూర్యాపేట, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): సూర్యాపేట జిల్లా పరిధిలోని కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల పరిధిలోని కృష్ణపట్టి వెంట ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీలతో ఆయా గ్రామాల ప్రజలు వేగలేకపోతున్నారు. రెండు నియోజకవర్గాల పరిధిలోని మేళ్లచెరువులో కీర్తి, మైహోమ్ ఫ్యాక్టరీలు ఉండగా. మఠంపల్లి మండలంలో నాగార్జున, గ్రే గోల్డ్, సాగర్, చింతలపాలెం మండలంలో అంజని, జువారీతోపాటు పాలకవీడు మండలంలో డెక్కన్, పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. నిత్యం ఫ్యాక్టరీలు వెదజల్లే లైమ్ పౌడర్, బొగ్గు కాల్చడం ద్వారా వెలువడే కార్బన్ మోనాక్సైడ్‌తో కూడిన బూడిద ఇండ్లు, రోడ్లు, పంటలపై పర్చుకుంటున్నది. వేసవిలో రోడ్లపై దుమ్ములేస్తుండడంతో కనీసం బయట తిరుగడం కష్టమవుతున్నది. గాలి కాలుష్యంతో ఊపిరితిత్తుల వ్యాధులతోపాటు అనేక రకాల జబ్బులు వస్తున్నాయి. సిమెంట్ కోసం భూమి లోపల ఉన్న సున్నపు రాయి తీసేందుకు భారీ గుంతలు తీయడంతో నీళ్లు కలుషితమై వాటిని తాగిన పశువులు అనేకం చనిపోయాయి.

ఫ్యాక్టరీలకు 5 కి.మీ. తీవ్ర ప్రభావం

సిమెంట్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసే చోట దాదాపు ఐదు ఎకరాల పరిధిలో మట్టితో పాటు వాయు, జల కాలుష్యం ముప్పు ఉంటుందని అధికారుల ద్వారా తెలిసింది. సిమెంట్ ఫ్యాక్టరీల నుంచి వెలువడే కాలుష్యంతో వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లుతున్నది. ఫ్యాక్టరీకి అతి సమీపంలో ఉన్న రైతులు ఏకంగా వ్యవసాయానికి దూరమై, విధిలేని పరిస్థితుల్లో తమ భూములను సిమెంట్ ఫాక్టరీలకు విక్రయించుకున్న ఘటనలు ఉన్నాయి.

కాలుష్యంతో ఇబ్బందులు

మా ప్రాంతంలో దక్కన్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నాం. ఫ్యాకరీ చుట్టుపక్క గ్రామాల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. పంట పొలాలు నాశనం అవుతున్నాయి. సిమెంట్ పరిశ్రమ వాహనాల వల్ల గ్రామాల్లో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగాలు నామమాత్రమే.

- కేతావత్ మధునాయక్, కల్మటితండా, పాలకవీడు మండలం, సూర్యాపేట జిల్లా

కాంగ్రెస్ ద్వంద్వ నీతి

- నాడు యాదాద్రి థర్మల్ ప్లాంట్‌పై నానా యాగీ
- నేడు అదానీ సిమెంట్ ఫ్యాక్టరీపై అలవికాని ప్రేమ
- పరిశ్రమల స్థాపనలో కాంగ్రెస్ పార్టీ డబుల్ గేమ్
- ముడి సరుకే లేని గ్రామంలో ఫ్యాక్టరీ ఏర్పాటా?
- రోడ్డు వెడల్పుతో వందలాది ఇండ్లు నేలమట్టం!
- నేడు రామన్నపేటలో ప్రజాభిప్రాయ సేకరణ

కాంగ్రెస్ అంటేనే అంత. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలోకి వచ్చాక ఒకలా ప్రవర్తించడం ఆ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య. రాజకీయ ప్రయోజనాలు తప్ప ప్రజాప్రయోజనాలు పట్టని పార్టీ అది. బీఆర్ఎస్ హయాంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టుపై నానా యాగీ చేసింది. వనరులు లేని చోట ప్రాజెక్టు ఎలా పెడతారంటూ గాయిగాయి చేసింది. చివరికి దానిని విచారణ అంశంలోనూ చేర్చింది. ఇప్పుడు అదే కాంగ్రెస్ పార్టీ అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి అడ్డగోలు అనుమతులిచ్చింది. విచిత్రం ఏంటంటే.. అప్పుడు వనరులు లేవని గోలగోల చేసిన ఇదే కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు కనుచూపు మేరలో వనరులన్నవే లేని చోట సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణానికి అనుమతులిచ్చింది. అది కూడా ఫ్యాక్టరీ చట్టాలను తుంగలో తొక్కి. కాంగ్రెస్ ద్వంద్వనీతికి ఇంతకుమించిన సాక్ష్యం ఇంకేం కావాలి.

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): తాను చేస్తే సంసారం.. పక్కోడు చేస్తే వ్యభిచారం అన్నట్టు తయారైంది కాంగ్రెస్ పార్టీ తీరు. నాడు అన్ని వనరులు, ముడిసరుకు ఉన్నా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను తప్పుబట్టిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు జీరో రా మెటీరియల్ ఉన్న రామన్నపేట అదానీ అంబుజా సిమెంట్ కంపెనీకి మాత్రం దాసోహం అంటున్నది. కనీసం ముడి సరుకు కూడా లేకపోవడంతో నిత్యం వందలాది భారీ వాహనాల రాకపోకలతో అక్కడి జనజీవనం అస్తవ్యస్తంగా మారనుంది. జిల్లా ఇప్పటికే ఫార్మా కాలుష్య రక్కసిలో చిక్కుకుని విలవిల్లాడుతున్నది. అంతకంటే ముందు నల్లగొండ ప్రజలు ఏండ్ల తరబడి ఫ్లోరైడ్‌తో జీవచ్ఛవాలుగా మారారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ భగీరథతో సురక్షిత తాగునీరు అందించి ఫ్లోరైడ్ రక్కసిని రూపుమాపారు. ప్రస్తుతం పల్లెలు పచ్చగా ఉన్న ఇలాంటి తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అదే పల్లెల మీద దాడికి దిగుతున్నది.

నాడు థర్మల్ ప్లాంట్‌ను వ్యతిరేకించి..

నల్లగొండ జిల్లాలోని దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ను జనావాసాలకు దూరంగా నిర్మించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా కృష్ణానది ఒడ్డున స్థాపించారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లే అవకాశం కూడా పెద్దగా లేదు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అధిక వ్యయాన్ని సైతం ప్రభుత్వం భరించింది. అలాంటి ప్రాజెక్టునే నాడు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. ఇప్పుడు అదే పార్టీ అదానీకి దాసోహం అయింది. రామన్నపేట నడిబొడ్డున, రీజినల్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్‌రోడ్డుకు దగ్గర్లో సిమెంట్ కంపెనీ స్థాపనకు అనుమతులిచ్చింది.

ముడి సరుకు లేదు.. వనరుల్లేవు

రామన్నపేటలో స్టాండ్ అలోన్ సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌లో ఏటా 6 ఎంఎంటీపీఏ సిమెంట్ ఉత్పత్తికి ప్రతిపాదనలు చేశారు. ఇక్కడ వనరులు, ముడి సరుకు లేకున్నా ఎందుకు ఏర్పాటు చేస్తున్నారో ఎవరికీ అంతు పట్టని ప్రశ్నగా మారింది. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఎన్నో అవసరాలు ఉంటాయి. ముఖ్యంగా సున్నపురాయి గనులు ఉండాలి. జిప్సం, బూడిద ఫ్లై స్లాగ్ అందుబాటులో ఉండాలి. కానీ ఇవేవీ ఇక్కడ లేవు. వీటితో పాటు హెచ్ఎస్‌డీ బొగ్గు కూడా నిల్వ చేస్తామని అదానీ తన నివేదికలో పేర్కొన్నది. మరోవైపు సరిపడా నీరు కూడా లేదు. ధర్మారెడ్డిపల్లి కాల్వ మినహా ఇతర వనరులు లేవు. గతంలో అసెంబ్లీ నియోజకవర్గం అయిన రామన్నపేటను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పునర్విభజనలో తొలగించింది. రూపురేఖలు లేకుండా రామన్నపేటను మార్చేసింది. మళ్లీ ఇప్పుడు సిమెంట్ ఫ్యాక్టరీ పేరుతో మండలాన్ని ఆగం చేయాలని కంకణం కట్టుకున్నది.

వందలాది ఇండ్లు నేలమట్టం

సిమెంట్ కంపెనీ కోసం స్థానికంగా వనరులు లేకపోవడంతో ముడిసరుకును ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. దాంతో నిత్యం ఈ ప్రాంతం నుంచి పెద్దఎత్తున భారీ వాహనాలను రవాణాకు ఉపయోగించాల్సి ఉంటుంది. 175 భారీ వాహనాలు ముడి సరుకును రవాణా చేయనున్నట్టు అదానీ తన రిపోర్ట్‌లో తెలిపింది. భారీ వాహనాల నుంచి 24 గంటల పాటు వచ్చే శబ్దాలు, దుమ్ము, ధూళితో జనజీవనం అస్తవ్యస్తంగా మారే ప్రమాదం ఉంది. చిన్న పిల్లలు ఇంటి నుంచి బయటకు వచ్చే పరిస్థితి ఉండదు. ప్రస్తుతం రవాణా కోసం 30 ఫీట్ల రోడ్డు మాత్రమే ఉంది. రామన్నపేట నుంచి కొమ్మాయిగూడెం మీదుగా పెద్దకాపర్తి దాటితే హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి ఉంది. ఇక్కడ ఇప్పుడున్న 30 అడుగుల రోడ్డును 100 అడుగులకు విస్తరించనున్నారు. అదే జరిగితే రోడ్డు విస్తరణలో కొమ్మాయిగూడెం, పెద్దకాపర్తి గ్రామాల్లోని వందలాది ఇండ్లు నేలమట్టం అవుతాయి. మరోవైపు పక్కనే ఉన్న రామన్నపేట రైల్వే స్టేషన్ నుంచి కంపెనీ వరకు ట్రాక్ కోసం దరఖాస్తు చేసుకున్నట్టు తెలిసింది.

వనరులు లేకున్నా ఎట్ల పెడ్తరు?

ప్రజలకు ఇబ్బంది కలగని ప్రాంతాల్లోనే కంపెనీలు ఏర్పాటు చేయాలి. జనాలు ఉండే రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం ఏంటి? అసలు ఇక్కడ ఎలాంటి వనరులూ లేవు. ఏ ఉద్దేశంతో కంపెనీని స్థాపిస్తున్నారు. నాడు యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ను కాంగ్రెస్ ఎలా వ్యతిరేకించింది? ఇప్పుడు అంబుజాకు ఎందుకు అనుమతి ఇస్తున్నది? కంపెనీ ఏర్పాటు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి. లేకుంటే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదు. ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది. అవసరమైతే హైకోర్టును ఆశ్రయిస్తాం.

- చిరుమర్తి లింగయ్య, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే

ప్రాణాలు పోయినా అడ్డుకుంటాం

కాంగ్రెస్ పార్టీ అదానీకి అమ్ముడుపోయి అడ్డగోలుగా అనుమతులు ఇస్తున్నది. స్కిల్ యూనివర్సిటీకి అదానీ 100 కోట్లు ఎందుకు ఇచ్చాడు? లోపాయికారి ఒప్పందాలు చేసుకుని ప్రజలను ఆగం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తున్నది. వనరులు లేకుంటే ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకోవాలి. 24 గంటలు తిరిగే భారీ వాహనాలతో ప్రజలు ఏమై పోవాలి? రోడ్లు వెడల్పు చేస్తే వందలాది ఇండ్లు పోతాయి. ప్రాణాలు పోయినా పరిశ్రమను పెట్టనివ్వం. ప్రజాభిప్రాయ సేకరణలో మా అభిప్రాయాన్ని చెప్పి అడ్డుకుంటాం.

- కన్నెబోయిన బలరాంయాదవ్, కక్కిరేణి, రామన్నపేట మండలం

ప్రాణాలకు నో గ్యారెంటీ!

జనావాసాల్లో సిమెంట్ ఫ్యాక్టరీలతో పెను ప్రమాదాలు

రామన్నపేటలో అంబుజా ఫ్యాక్టరీతో స్థానికుల్లో కలవరం

దేశంలోని పలు అంబుజా సిమెంట్ ప్లాంట్లలో ప్రమాదాలు

సిమెంట్ ఫ్యాక్టరీలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లాలోని రామన్నపేటలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు సన్నాహాలు ముమ్మరమయ్యాయి. మండల కేంద్రానికి 500 మీటర్ల దూరంలోనే ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తుండటంపై స్థానికులు మండిపడుతున్నారు. దేశవ్యాప్తంగా ఈ కంపెనీకి చెందిన 17 ప్లాంట్లు ఉన్నాయి. వీటిల్లో జరిగిన ప్రమాదాలతో పలువురు కార్మికులు మృతి చెందగా, పదుల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. దీంతో కంపెనీలో భద్రతా ప్రమాణాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వీటిని చూశాక కూడా మారరా?

సిమెంట్ ఫ్యాక్టరీలతో మనుషులకు ఆరోగ్య సమస్యలు, పర్యావరణానికి హానికరం, ఫ్యాక్టరీల్లో ప్రమాదాలతో వందలాది మంది మృత్యువాతపడుతున్నట్టు, వేలాది మంది క్షతగాత్రులుగా మారుతున్నట్టు అంతర్జాతీయ కార్మిక సంస్థ గణాంకాలు చెప్తున్నాయి. ఏపీలోని జగ్గయ్యపేటలో గత జూలైలో రెండు సిమెంట్ ఫ్యాక్టరీల్లో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు కార్మికులు మరణించగా, 20 మందికి పైగా గాయపడ్డారు. నిరుడు ఛత్తీస్‌గఢ్‌లోని ఓ సిమెంట్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు, 2022లో గుజరాత్‌లోని మరో సిమెంట్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో మరో ముగ్గురు కార్మికులు మృత్యువాతపడ్డారు.

ఫ్యాక్టరీ వద్దంటూ నిరసనలు

తమ ప్రాంతంలో ఫ్యాక్టరీ పెట్టవద్దని పలు రాష్ట్రాల్లో పల్లెవాసులు నిరసనలు చేపట్టారు. ఫ్యాక్టరీ ఏర్పాటుచేసి ఉపాధి కల్పిస్తామన్ననెపంతో భూములు, ఆవాసాలు, ఆరోగ్యాన్ని నాశనం చేయవద్దని మేఘాలయలోని వహైజార్ గ్రామస్థులు ఈ నెల మొదట్లో ఉద్యమాన్ని చేపట్టారు. తమ ప్రాంతంలో నిర్మించాలనుకొన్న మెగాటాప్ కంపెనీకి వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. అస్సాంలోని తాజ్ సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా గత జూలైలో పెద్దఎత్తున చేపట్టారు.

అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీల్లో ప్రమాదాలు ఇలా

ప్లాంట్ పేరు	ప్రమాదం తేదీ	మరణాలు (క్షతగాత్రులు)
అంబుజా సిమెంట్స్ లిమిటెడ్, భాట్‌పరా2 (ఛత్తీస్‌గఢ్)	04.02.2023	5 (20)
అంబుజా సిమెంట్స్ లిమిటెడ్, భాట్‌పరా (ఛత్తీస్‌గఢ్)	18.09.2017	2 (14)
అంబుజా సిమెంట్స్ లిమిటెడ్, మర్వార్ ముండ్వా (రాజస్థాన్)	18.11.2021	1 (7)
అంబుజా సిమెంట్స్ లిమిటెడ్, భటిండా (పంజాబ్)	27.04.2023	1(4)
అంబుజా సిమెంట్స్ లిమిటెడ్, దార్లఘాట్ (హిమాచల్‌ప్రదేశ